క్లుప్తంగా

ఆరోగ్యంపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న నాగభూషణం

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టిసారించాలని డీఆర్పీ హెచ్.నాగభూషణ అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని చెప్పారు. చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో బుధవారం కొఠారీ గ్రామ సచివాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులపై చిన్నచూపు తగదన్నారు. సుఖ వ్యాధులు వల్ల కలిగే నష్టాలను వివరించారు. సందేహాలు తీర్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, సీఎల్‌డబ్ల్యూ గున్న రవి, సూపర్‌వైజర్ సుధాకర్, దుక్క ఆనంద్, కొచ్చెర్ల యాదవరెడ్డి పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సంతకంతో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

టెక్కలి: తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతకాలతో కూడిన ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్షాపే కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు చెందిన కీర్తన, టోనిప్రియ, మహేష్, భూమిక, సునీత, ప్రవల్లిక, శ్రీనివాస్ తదితర విద్యార్థులు ఈ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎ.ధర్మారావుతో పాటు ఉపాధ్యాయులంతా విద్యార్థులను బుధవారం అభినందించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రుణాన్ని అందజేస్తున్న దృశ్యం

మందస: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను స్వయంశక్తిసంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు, హరిపురం ఏపీజీవీబీ మేనేజర్ ఎం.విజయ్‌తేజ్ అన్నారు. మండలంలోని శ్రీలక్ష్మి, మదర్‌థెరిసా స్వయంశక్తి సంఘాలకు రూ.20 లక్షలు వంతున బ్యాంకు లింకేజీని బుధవారం అందజేశారు. రికార్డు స్థాయిలో ఒక్కో గ్రూపునకు రూ.20 లక్షల లింకేజీని అందజేయడం జరుగుతోందన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడడానికే పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం హరిపురంలో వైఎస్సార్ చేయూత ప్రిలాంఛింగ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏలు రాములమ్మ, మహలక్ష్మి, చంద్రిక, వీఓ అధ్యక్షురాలు చందన పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలో తరలిస్తూ అధికారులకు పట్టుబడిన బియ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఒడిశాకు ఆటోలో తరలిస్తున్న 900 కేజీల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, పౌరసరఫరాల శాఖాధికారులు మంగళవారం సాయంత్రం శాసనాం వద్ద పట్టుకున్నారు. అలాగే ఎం.తోటూరు రైల్వే గేట్ వద్ద వ్యాన్‌లో ఒడిశాకు తరలిస్తున్న 1300 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎస్సై బి.రామారావు, సీఎస్‌డీటీ కె.సంతోష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అర్హులందరికీ వంద పనిదినాలు



పనులు వివరాలు వెల్లడిస్తున్న టీఏ పితంబర్

ఇచ్ఛాపురం రూరల్: అర్హులందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ పథకం అధికారులపై ఉందని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. బూర్జపాడు గ్రామ పంచాయతీలో బుధవారం నిర్వహించిన ఉపాధిహామీ పథకం గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో చేసిన పనులు, హాజరైన కూలీల వివరాలు, ఖర్చులను గ్రామ సభల్లో సిబ్బంది వివరించారు. ఈ ఏడాదికి సంబంధించి రూ.1.83 కోట్ల విలువైన పనుల గుర్తింపు, నిధుల అంచనాలను టెక్నికల్ అసిస్టెంట్లు బెందాళం మణికంఠ, దక్కత పితంబర్, సురేష్ సభలో తెలియజేశారు. సర్పంచ్ బుడ్డ కల్యాణ్, గ్రామ పెద్ద దున్న ఆనంద్ పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం.. అదే ప్రభుత్వ ధ్యేయం

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని నాయకులు, అధికారులు అన్నారు. దీని కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పౌష్టికాహార ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



సంతబొమ్మాళి: అంట్లవరంలో మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపతిరావు రాఘవరావు



సోంపేట: పాలవలసలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్



మందస: కొంకడాపుట్టిలో మాట్లాడుతున్న ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు



కోటబొమ్మాళి సచివాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్



టెక్కలి గ్రామసచివాలయం-3లో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీవో లక్ష్మీబాయి, సర్పంచ్ గొండేల సుజాత



కంచిలి: బొగాబెణిలో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్రలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిన శ్రీనివాసరావు, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్



ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురంలో పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ



ఇచ్ఛాపురం: మందులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పార్టీ నాయకులు



కవిటి: బిగొనపపుట్టుగలో గర్భిణులకు పోషణకిట్లు అందజేస్తున్న సర్పంచ్ బద్రి ప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు పిరియా కృష్ణారావు



పలాస: కేదారిపురంలో రోగుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



సేవ్ చైల్డ్ ఆకారంలో లింగాలవలస పాఠశాల విద్యార్థులు



మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

టెక్కలి: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని టెక్కలి ఎస్సై ఎల్.రామకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల సంరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన..

జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. సేవ్ చైల్డ్ ఆకారంలో విద్యార్థులు నిల్చొని ప్రదర్శన చేశారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేట్టాలి

● డ్వామా పీడీ చిట్టిరాజు



మునగతోటను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

కోటబొమ్మాళి: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులు చేట్టాలని..అందుకు తగ్గట్టుగా 2024-25 ఏడాదికి సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. కోటబొమ్మాళిలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బంది, ఫీల్డు అసిస్టెంట్లతో బుధవారం సమీక్షించారు. పొలాలకు రాతిగట్లు, వ్యవసాయ బావుల నిర్మాణం, గట్లపై మొక్కలు నాటడం, పండ్ల తోటల పెంపకం, పోడుభూములు చదును చేయడం, పొలాలకు ఒండ్రు మట్టి తరలింపు, కంపోస్టు ఎరువుల తయారీకి గుంతల నిర్మాణం వంటి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఉపాధి హామీ పథకం ద్వారా సాగుచేస్తున్న ఎత్తురాళ్లపాడుకు చెందిన సనపల చిన్నారావుకు చెందిన మునగ పంటను పరిశీలించారు. 15 రోజులకు రూ. ఏడు వేలు ఆదాయం వచ్చిందని రైతు పీడీకి చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఏపీవో అరుణ్‌కుమార్, డ్వామా జేఈ హరిప్రసాద్ ఉన్నారు.

సాగునీరు అందించాలని వినతి




శ్రీరామమూర్తికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నందిగాం: సాగునీరు అందించి పంటలను కాపాడాలి ఆనందపురం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తిని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అంజేశారు. వంశధార కాలువ నీరు శివారు ఆయకట్టుకు రాకపోవడంతో వరి చేను పొట్టదశలో ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీపీ వంశధార అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. కాలువ ద్వారా ఆనందపురం, పెద్దబాణాపురం, కవిటి అగ్రహారం, మర్లపాడు గ్రామాల ఆయకట్టు సాగునీరు వెళ్లేలా చూడాలని కోరారు. అలాగే వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మను ఆయా గ్రామాలను సందర్శించి ఎండిపోతున్న పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని సూచించారు.

13, 14 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: పలాస పట్టణంలో ఈ నెల 13, 14 తేదీల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఎస్.వివేకానంద తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు మారుస్తున్నందున ఈఈ ప్రసాదరావు ఆదేశాల మేరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మాల్యాద్రి చౌదరికి ఘనంగా నివాళి



మాల్యాద్రి చౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి తదితరులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో ఇటుక బట్టీలకు వ్యవస్థాపకులుగా పేరుపొందిన బత్తిన మాల్యాద్రి చౌదరికి పలువురు ప్రముఖులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనారోగ్యంతో ఇటీవల ఆయన మృతి చెందగా.. బుధవారం పెద్దకర్మ జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

బీసీ మహిళలకు ప్రాధాన్యమివ్వాలి

కంచిలి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీసీ మహిళలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యమివ్వాలని అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ సీపాన గుణవతి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వారసత్వ రాజకీయాలకు స్వస్తిపలికి మేధావులైన మహిళలకు చట్టసభలకు పంపించడం ద్వారా న్యాయం జరుగుతోందన్నారు.

నేడు టి.బరంపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురం గ్రామ సచివాలయం పరిధిలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి బుధవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పాల్గొంటారన్నారు. అనంతరం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం ఉంటుందన్నారు.

కోవిడ్ సేవకులకు సన్మానం



ఏఎన్‌ఎం ఊర్వశిని సన్మానిస్తున్న డాక్టర్ జగదీష్

వజ్రపుకొత్తూరు: కంబాలరాయుడుపేటలో కోవిడ్-19 సమయంలో గ్రామంలో విస్తృత సేవలు అందించిన ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను బుధవారం స్థానికులు ఘనంగా సత్కరించారు. స్థానిక సర్పంచ్ వంక చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు జగదీష్, పి.సుధీర్, కె.ప్రత్యూష, వై.వెంకటేష్‌లు కోవిడ్ సేవలు అందించిన ఏఎన్ఎం టి.ఊర్వశి, ఆశ కార్యకర్తలు వి.భారతి, కె.సరోజిని, ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి, ఆర్ఎంపీ వైద్యుడు కె.శివాజీలకు దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. గోవిందపురం వైద్య సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కుళాయిల పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి ఇంటికీ మంచినీరు అందించడమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. కొఠారీ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటింటికీ కుళాయి పనులను బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, ఉప్పాడ రాజారెడ్డి, దుక్క ఆనంద్, రాంపత్ని చిట్టిబాబు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

డిగ్రీలో చేరేందుకు 13న స్పాట్ అడ్మిషన్లు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరే వారికి కోసం ఈ నెల 13వ తేదీన స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోవిందమ్మ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య హాజరు కావాలన్నారు.

అక్రమ చొరబాట్ల నియంత్రణపై దృష్టి



కవిటి తీరంలో పర్యటిస్తున్న పోలీసులు

కవిటి: సముద్ర మార్గంలో అక్రమ చొరబాట్లను నియంత్రించేందుకు పోలీసులు సాగర్ కవచ్ గస్తీ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై వి.రమేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని తీర ప్రాంత గ్రామాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన గస్తీని బుధవారం పరిశీలించారు.

నవ్య హత్య కేసులో నిందితుల్ని శిక్షించాలి

టెక్కలి: నరసన్నపేటకు చెందిన నవ్య హత్య కేసులో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి టెక్కలిలో వైశ్యులంతా కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల పావనిరాణితో పాటు మహిళలు, వర్తక, వ్యాపార సంఘాల ప్రతినిధులంతా ర్యాలీలో పాల్గొని నవ్యను హత్య చేసిన వారికి ఉరి తీయాలంటూ నినాదాలు చేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలి

కాశీబుగ్గ: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 16 సచివాలయాల పారిశుద్ధ్య విభాగ సెక్రటరీలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. కౌన్సిలర్ పప్పల ప్రసాద్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ పాల్గొన్నారు.

జానపద కళాకారుడు మృతికి సంతాపం

పలాస: ఉద్దానం ప్రాంతానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు సాలిన అశోక్‌కుమార్ మృతిపై గిడుగు రామ్మూర్తి తెలుగు భాష జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు, సభ్యులు సంతాపం తెలియజేశారు. అశోక్‌కుమార్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించి ఓదార్చరు. కళాకారులు అమ్మ రామక్రిష్ణ, అందాల కోటేశ్వరరావు, సాలిన జోగారావు, శిస్టు మనోజ్ ఉన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

కాశీబుగ్గ: అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాకపోకలు జరుపుతున్నటువంటి ప్రయాణికులకు బాలికల సంరక్షణను వివరించారు. జీఆర్పీ హెచ్‌సీ కోదండరావు, దేవేంద్ర, శ్రీను, భాను చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ జె.భాగ్యరెడ్డి, జాస్మిన్ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ చేరీవీధిలోని గ్రామసచివాలయం-4లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న శిబిరాన్ని స్థానికుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ హడ్కోకాలనీలో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టుమున్సిపల్ కమిషనర్ తెలిపారు. 29, 30, 31 వార్డులకు సంబంధించి శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

సోంపేట: జింకిభద్ర గ్రామంలోని పాఠశాల ఆవరణలో శిబిరాన్ని నిర్వహిస్తామని కొర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవందిత తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

కంచిలి: జలంత్రకోట గ్రామానికి చెందిన కృపాసింధు పట్నాయక్(57) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుని కుటుంబాన్ని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయనతోపాటు మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, స్థానిక నేత ప్రకాష్ చంద్ర పండా పాల్గొన్నారు.

పేద కటుంబానికి అండగా..

కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన నీలాపు స్వాతి భర్త లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన హెల్పింగ్ వారియర్స్ సభ్యుల ప్రోత్సాహంతో లంక వనిత బాధితురాలికి నిత్యావసర సరుకులను బుధవారం అందజేసి అండగా నిలిచారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

కంచిలి: విధి నిర్వహణలో అందించిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు వస్తుందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘకాలం సేవలందించి, పదోన్నతిపై సోంపేట మండల పొత్తంగి సిరిపురం హైస్కూల్ రికార్డు అసిస్టెంట్‌గా వెళ్లిన బృందావన్ చంద్ర మహాపాత్రోను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సన్మానించారు. ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్, ఈవోపీఆర్డీ రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

కంచిలి: కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు సూర్య ప్రభాకరరావు, వజ్జ రామారావు, ఎస్.దేవదాసు, కొండే కుసరాజు, మార్పు రవికుమార్, జయలక్ష్మిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిబెహరా అధ్యక్షతన ఎంఈఓ-2 కె.చిట్టిబాబు చేతులమీదుగా సన్మానించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దుర్గాసి ధర్మారావు, ఉప సర్పంచ్ శంకరరావు, పొందూరు శ్రీను, విద్యాకమిటీ చైర్మన్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వార్డు కౌన్సిలర్ ఉదారత

ఇచ్ఛాపురం: స్థానిక 23వ వార్డు బెల్లుపడ కాలనీకి చెందిన మేడిమి సుజాత అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆ వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్‌కుమార్ బాధితరాలి వైద్యం కోసం బుధవారం రూ. 6 వేలు అందించి ఉదారతను చాటుకున్నారు. స్థానిక పెద్దలు గువ్వాడ దిలీప్, గవరయ్య, అప్పయ్య పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడి ఔదార్యం



వాహనం వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

కాశీబుగ్గ: చినంచల ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బమ్మిడి దుర్యోధనరావు ఔదార్యాన్ని చాటుకున్నారు. మంచినీటికి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి దుర్యోధనరావు సొంతనిధులతో ఎనిమిది వేల లీటర్ల మినరల్ వాటర్‌ను సమకూర్చి వాహనం ద్వారా బుధవారం పంపిణీ చేశారు. దీంతో స్థానికులు అతన్ని అభినందించారు.

విధుల్లో చేరిన పంచాయతీ సిబ్బంది

టెక్కలి: బకాయి వేతనాలు చెల్లించాలని, పంచాయతీ పరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజులుగా సమ్మె చేపట్టిన టెక్కలి మేజర్ పంచాయతీ సిబ్బంది బుధవారం నుంచి విధుల్లోకి చేరారు. పంచాయతీలో పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది సమ్మె చేపట్టడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్, డీఎల్‌పీవో ఐ.వి.రమణ సిబ్బందితో చర్చించారు. బకాయి వేతనాలు చెల్లించే విషయంలో సబ్ కలెక్టర్ చొరవ చూపడంతో సిబ్బంది విధుల్లోకి చేరారు.